కాల్వల మరమ్మతు జరిగేనా?

- జూరాల, భీమా కాల్వల కింద 40వేల ఎకరాల్లో సాగు
- ప్రతి ఏటా చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళనలో అన్నదాతలు


పాడైన జూరాల పంట కాల్వ లైనింగ్


కల్వరాల సమీపంలో భీమా కాల్వలో పేరుకుపోయిన మట్టి

వీపనగండ్ల: మండల వ్యాప్తంగా జూరాల, భీమా కాల్వలు ఏళ్లుగా మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో యాసంగి పంటలను సాగు చేయకుండా క్రాప్ హాలీ డే ప్రకటించామని, రైతులు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ సారైనా జూరాల, భీమా కింద పాడైన కాల్వల మరమ్మతు చేపట్టి చివరి ఆయకట్టు పంటలకు సాగునీరు అందే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. కాల్వల మరమ్మతు కోసం ఎన్నోమార్లు విసిగి వేసారిన రైతులు అధికారులు ప్రకటించినట్లుగా క్రాప్ హాలీ డేకు సహకరిస్తామని, ఉన్నతాధికారులు స్పందించి కాల్వల మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

40 వేల ఎకరాల్లో సాగు

మండలంలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ద్వారా గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, తూంకుంట, సంపత్‌రావుపల్లి తదితర గ్రామాల్లోని రైతులు రెండు పంటలను సాగు చేసేవారు. అలాగే భీమా కాల్వ కింద కల్వరాల, పుల్గర్‌చర్ల, సంగినేనిపల్లి, రంగవరం తదితర గ్రామాల్లో దాదాపు 40 వేల ఎకరాల్లో పంటలను సాగు చేస్తున్నారు. గోపల్‌దిన్నె రిజర్వాయర్, శ్రీరంగాపురం రిజర్వాయర్ల ద్వారా సాగు నీటిని వినియోగించుకునే వారు. కానీ క్రాప్ హాలీ డే ప్రకటించడంతో ఈ యాసంగిలో కాల్వల కింద పంటలను సాగు చేయలేదు.

నిధుల మంజూరులో జాప్యం

కాల్వల మరమ్మతుకు నిధులు మంజూరు కాకపోవడం, మండలంలో పలు గ్రామాల్లోని ప్రధాన కాల్వలకు గండ్లు పడడం, లైనింగ్ పాడవడం, సబ్ మైనర్లు, పంట కాల్వలు పూర్తిగా ధ్వంసం కావడంతో చివరి ఆయకట్టు గ్రామాలైన సంగినేనిపల్లి, తూంకుంట, సంపత్‌రావుపల్లి, వీపనగండ్ల రైతులు ప్రతి ఏటా సాగునీరు అందక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాల్వలకు నీటిని నిలిపివేసిన సమయంలో అయినా ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధులతోనే సాధ్యం



క్రాప్ హాలీడే సమయంలో ప్రత్యేక నిధులు కేటాయిస్తే తప్పా.. పాడయిన కాలువలు మరమత్తులకు నోచుకోవు. కాల్వల మరమ్మతు చేయించాలని ఎన్నో ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు.

– రాజశేఖర్, రైతు, రంగవరం

ఆందోళనలు చేస్తాం



పాడయిన పంట కాలువల మరమ్మతు కోసం రైతులు చేస్తున్న విజ్ఞాపనలను పరిగణలోకి తీసుకోకుంటే రైతులను సమీకరించి ఆందోళనలు నిర్వహిస్తాం. యుద్ధప్రాతిపదికన ప్రధాన కాల్వల్లో పేరుకుపోయిన జమ్ము, షిల్టు, పాడైన ఫీల్డ్ చానళ్లను వెంటనే బాగు చేయాలి.

– రాకేష్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు, వీపనగండ్ల

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

మండలంలో పాడైన కాల్వల మరమ్మతు కోసం అవసరమైన నిధులు కేటాయించాలని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. జూరాల కాలువ ద్వార రైతులు కొందరు బావుల పేరుతో పంటలను సాగు చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. పూర్తి స్థాయిలో క్రాప్ హాలిడేకు సహకరించాలి. గోపల్‌దిన్నె రిజ్వాయర్ నీటిని ఈ వేసవిలో తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగిస్తాం.

– ప్రభు, ఏఈ జూరాల ప్రాజెక్టు పెబ్బేరు

క్లుప్తంగా

సెల్‌ఫోన్ల అప్పగింత



నర్వ: మండలంలోని కల్వాల్, లంకాల్ గ్రామాలకు చెందిన వ్యక్తులు మొబైల్ ఫోన్లను పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ ద్వారా గుర్తించి బాధితులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. కల్వాల్‌కు చెందిన శాంతకుమార్, లంకాల్‌కు చెందిన పరశురాం సెల్‌ఫోన్లను పోగొట్టుకోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఈఐఆర్‌లో నమోదు చేసి లొకేషన్ ఆధారంగా వాటిని గుర్తించామని పోలీసులు తెలిపారు. ఎవరైనా తమ మొబైల్‌ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్‌లో నమోదు చేసి ఫిర్యాదు చేయాలన్నారు. విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు దొరికితే తమ వద్ద ఉంచుకోకుండా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని కోరారు.

విజేతలకు బహుమతులు



పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని శ్రీకృష్ణవేణి పాఠశాల ఆధ్వర్యంలో పెబ్బేరు ఉమ్మడి మండలంలోని కళాశాల, పాఠశాల స్థాయిలో శనివారం కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు పాఠశాల హెచ్‌ఎం రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. ఈ పోటీల్లో పది పాఠశాలల నుంచి 10 జట్లు పాల్గొన్నాయి. వారిలో మొదటి బహుమతి శ్రీరంగాపూర్ హైస్కూల్ విద్యార్థులు, రెండో బహుమతి పెబ్బేరు మోడల్‌స్కూల్ విద్యార్థులు గెలుపొందగా.. వారికి ఎంఈఓ జయరాములు, హెచ్‌ఎం రాఘవేందర్‌గౌడ్ బహుమతులు అందజేశారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శాగాపూర్ సర్పంచ్ మౌనికయాదవ్, మండల కోఆప్షన్ సభ్యుడు హలీంపాషా అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం శాగాపూర్‌లో కేంద్ర ప్రభుభుత్వ పథకాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, ఆయా పథకాలపై ఎల్‌ఈడీ స్క్రీ ద్వారా అవగాహన కల్పించారు. ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు గ్రామ గ్రామాన తెలియపర్చడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్ యోజన, స్వచ్ఛభారత్, పీఎం స్వానిధి, ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, పెన్షన్లు వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ లారెన్స్ అన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సుమిత్ర, పంచాయతీ కార్యదర్శి రమేష్, నాయకులు శివరామ్, తిరుపతియాదవ్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల అందజేత



కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జెడ్పీహెచ్‌లోని పదో తరగతి విద్యార్థులకు సామాజిక కార్యకర్త పోచ రవీందర్‌రెడ్డి ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వామి వివేకానంద స్వామిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వివేకానంద చెప్పినట్లు మన బలహీనతే మరణమని, మన బలమే మనకు విజయాన్ని తెచ్చిపెడుతుందన్నారు. పరీక్షల్లో ఆత్మవిశ్వాసంతో మంచి గ్రేడ్లు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌గౌడ్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అంటు వ్యాధులు ప్రబలే పరిస్థితులు నెలకొంటాయని, వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్య ఆరోగ్య శాఖ వైద్యులు ప్రజలకు వివరించారు. శనివారం కల్వరాల, నాగర్లబండతండా గ్రామాల్లో మా సంకల్ప వికసిత భారత్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ


వీపనగండ్లలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

అమరచింత: జిల్లా విద్యాశాఖతో పాటు మ్యాథమేటిక్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు ప్రతిభ కనపర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బలరాముడు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్ మీడియం నుంచి హాజరయ్యారు. వీరిలో ఇంగ్లిష్ మీడియం నుంచి అమరచింత జెడ్పీ పాఠశాలకు చెందిన తస్లీమా ప్రథమ, సమ్రీన్ ద్వితీయ, వీరేష్ మూడో స్థానంలో ఎంపికయ్యారు. తెలుగు మీడియంలో జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అచ్యుత్‌రెడ్డి, అజయ్ మొదటి, రెండవ స్థానంలో అజయ్ ఎంపికయ్యారు. వీరందరూ ఈనెల 22న జిల్లా స్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేంద్రం, విజయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: విద్యార్థులు ఉన్నత స్థాయి చదువుల్లో రాణించాలంటే పాఠశాల స్థాయిలో నిర్వహించే పలు రకాల పోటీల్లో పాల్గొనాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గణిత మేధావి రామానుజన్ జయంతిని పురస్కరించుకుని మండల స్థాయిలో గణిత టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పోటీ పరీక్షల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియం నుంచి 8 పాఠశాల విద్యార్థులు పాల్గొనగా.. తెలుగు మీడియంలో ప్రథమ విజేతగా మల్లేశ్వరి, ద్వితీయ స్థానంలో భరణి, తృతీయ స్థానంలో మౌనిక, ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ విజేతగా చరణ్‌తేజ, ద్వితీయ స్థానంలో వినోద్‌కుమార్, తృతీయ స్థానంలో శివ ప్రతిభను కనబరిచారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, శేఖర్‌నాయుడు, మహేష్, కేశవులు, గోపాల్, రాజు, జ్యోతి, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి


దావాజిపల్లిలో మాట్లాడుతున్న హెచ్‌ఎం, సర్పంచ్


మనిగిల్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో..


దుప్పల్లిలో..

కొత్తకోట రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపితేనే చదువులో ఉత్తమంగా రాణిస్తారని మనిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నపాఠశాల హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 29న నిర్వహించనున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అయిందని, ఆసక్తి గల వారు పాల్గొనాలని కోరారు. పాఠశాల అభివృద్ధికి ఎస్‌ఎంసీ కమిటీ యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక ప్రణాళికను వివరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం వెంకటేశ్వర్లు గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్ కుమార్, నాగేశ్వరమ్మ, చంద్రకళ, సురేంద్రనాథ్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలల్లో పాఠశాల అభివృద్ధికి సహకరించే వారినే ఎన్నుకోవాలని దావాజిపల్లి సర్పంచ్ వెంకటయ్యయాదవ్ అన్నారు. శనివారం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ కమిటీపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి పంపించాలని, బాల్య వివాహాల నివారణ, ప్రభుత్వ బడుల బలోపేతానికి తోడ్పాటునందించాలన్నారు. విద్యార్థుల ప్రగతి, ఎస్‌ఎంసీ కమిటీ బాధ్యతలు, ఎన్నిక విధానంపై హెచ్‌ఎం బద్రూనాయక్ సమావేశంలో వివరించారు.

మదనాపురం: విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆంజనేయులు కోరారు. శనివారం దుప్పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులతో సన్నిహితంగా ఉండి వారి అభ్యున్నతికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్వరి, వైస్ చైర్మన్ రాజారాం విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: బడుల బలోపేలానికి తల్లిదండ్రులు సహకరించాలని ఎంఈఓ జయరాములు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ (బాలికల) ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాల పెంపునకు తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపలన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ


చిక్కేపల్లిలో అయోధ్య అక్షింతల పూజలో గ్రామస్తులు


కత్తేపల్లిలో..

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం, రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పండుగను చేసుకోవాలని నాయకులు కోరారు. శనివారం రామమందిర ట్రస్ట్ పంపిన అక్షింతలు మండలంలోని పిన్నంచర్ల, కత్తేపల్లిలో ఇంటింటికీ పంచిపెట్టారు. స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేస్తామని వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారుశ్రీనివాసులు, సర్పంచులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మిమచ్చేందర్, ఉపసర్పంచ్ మాసన్న, ఎస్‌ఆర్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అయోధ్యకు యువకులు

అమరచింత: అయోధ్యలో ఈనెల 22న జరిగే బాల శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు అమరచింతకు చెందిన యువకులు మోటార్ బైక్‌లపై శనివారం అయోధ్యకు తరలివెళ్లారు. పట్టణానికి చెందిన సాక రమేష్, తెలుగు పరుశురాం, కంకరి వినోద్, కంకరి చిన్న, తోకలి భీమరాజ్ బైక్ యాత్ర ద్వారా అయోధ్యకు తరలివెళ్లారని విశ్వహిందూ పరిషత్ సభ్యుడు నరాల సిద్దురాములు తెలిపారు.

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి ఆంజనేయ ఆలయంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వెంకటేష్‌యాదవ్, సురేష్, రాంచందర్, నాగిరెడ్డి, శివరాజు, అంజి, భాస్కర్, రాముడు, భగతవంతు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: అయోధ్య శ్రీరాములవారి అక్షింతలను శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, నాయకులు రాధాకృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

చిరుత దాడిలో మేక మృతి

ఖిల్లాఘనపురం: మేతకోసం గుట్టకు వెళ్లిన ఓ మేకను చిరుత ఎత్తుకెళ్లి చంపిన ఘటన షాపురం శివారులో శనివారం సాయంత్రం చోటు చేసుకోగా.. రాత్రి వెలుగులోకి వచ్చింది. వివరాలు మండలంలోని షాపురం గ్రామానికి చెందిన మామిళ్ల శేషయ్య శనివారం ఉదయం తన మేకలను మేపేందుకు గ్రామ శివారులోని గుట్టల్లోకి తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాగా.. వాటిలో ఓ మేకపిల్ల తల్లి కోసం అరవడం కనిపించింది. ఇది గమనించిన శేషయ్య మేక ఇంటికి రాలేదని గమనించి కొందరు గ్రామస్తులతో కలిసి తను సాయంత్రం మేకలను తోలుకొచ్చిన ప్రాంతంలో వెతికాడు. కెతావత్ మన్యం వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఓ గుట్టపైన చీకట్లో చిరుత పులి కనిపించింది. ఈ విషయాన్ని గ్రామస్తులందరికీ చెప్పడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు గుట్ట వద్దకు వెళ్లి కేకలు వేయడంతో చిరుత గుట్టల్లోకి వెళ్లడంతో గ్రామస్తులు ఆ ప్రాంతంలో మేక కోసం వెతికారు. ఓ గుహలో మేక చనిపోయి కనిపించింది. దగ్గరకు వెళ్లి చూడగా మేకను చిరుత చంపడంతో పాటుగా కొంత మాంసాన్ని తిని మిగతాది అక్కడే వదిలేసింది. చేసేది లేక మేక యజమానితో పాటు గ్రామస్తులు అక్కడి నుంచి గ్రామానికి తిరిగి వచ్చారు. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు వివరించామని గ్రామస్తులు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 20వ వార్డుకు చెందిన మెగావత్ మన్యం అనారోగ్యంతో మరణించారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.10వేల ఆర్థికసాయం పంపించడంతో ఆయన బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో శంకర్‌నాయక్, కౌన్సిలర్ లక్ష్మి, కృష్ణబాబు, బొంబాయి మన్నెంకొండ, వెంకటేష్, రవి యాదవ్, శివకుమార్, కిషోర్‌రావు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 3వ సెంటర్‌కు చెందిన ఉప్పరి గుంటి వెంకటయ్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి పార్టీ పరంగా ఆదుకుంటామని భరోసా ఇవ్వాలని పార్టీ నాయకులను ఆదేశించారు. జెడ్పీ చైర్మన్ ఆర్ లోక్‌నాథ్‌రెడ్డి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, వెంకటస్వామి, సర్పంచ్ నిర్మల, రాధాకృష్ణతో కలిసి శనివారం గ్రామంలో మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థుల నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉత్తమంగా విద్యాబోధన చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కలెక్టర్‌గా నర్మద, డీఈఓగా శైలజ, జీసీడీఓగా శ్రీవిద్య, ఎంఈఓగా భారతి, ఎస్‌ఓగా శర్వాణి, వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ వాణి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఓటర్ల నమోదుపై దృష్టి


పామిరెడ్డిపల్లిలో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


అమరచింతలో..

అమరచింత: 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు కోసం దరకాస్తు చేసుకోవాలని తహసీల్దార్ చాంద్ పాషా కోరారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పట్టణంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓటరు దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థ వారు యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి మొదటి రోజు 20 మంది దరఖాస్తులు సమర్పించారని, వీరిలో ఏడుగురు మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని కోరినట్లు తెలిపారు. 13 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గోపాల్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి, దావాజిపల్లి, చింతకుంట, మల్లాయిపల్లి, మాందాపూర్, రాయినిపల్లి, అన్నారం, కిష్టాపూర్, రేమద్దుల గ్రామాల్లో శనివారం డిప్యూటీ తహసీల్దార్ అశోక్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నూతన ఓటరు నమోదు, ఫాం8 వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఓటరు నమోదుకు 47, ఫాం 8కు 26 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు మహేష్, తిరుపతయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో కొత్త ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బీఎల్‌ఓలు సర్పంచ్ సిద్ధయ్యతో కలిసి ఎన్నికల సంఘం విడుదల చేసిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఇందిరమ్మ, పంచాయతీ కార్యదర్శి జయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్, జూనియర్ వెటర్నరీ వైద్యుడు జగదీష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలో 18 ఏళ్లు నిండిన యువత కొత్తగా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పాండునాయక్ అన్నారు. శనివారం ప్రత్యేకంగా చేపట్టిన ఓటర్ల నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతో పాటు మానాజీపేట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో 69 మంది కొత్తగా ఓటరుగా పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారని, పేర్లు, అడ్రస్ తదితర మార్పులు, చేర్పుల కోసం 77 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 10 మంది మృతి చెందిన గుర్తించామన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా తహసీల్దార్ రాజు మండల వ్యాప్తంగా శిబిరాలను సందర్శించి బీఎల్‌ఓలతో వివరాలు సేకరించారు. కార్యక్రమంలో డీటీ చాణక్య, ఆర్‌ఐ జయమ్మ, సీనియర్‌అసిస్టెంట్ నాగేంద్రప్రసాద్, బీఎల్‌ఓలు ఉన్నారు.

ఓటరు నమోదులో తప్పులుండొద్దు

వీపనగండ్ల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో నూతన ఓటర్లుగా పేర్లను నమోదు చేసే సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని తహసీల్దార్ వరలక్ష్మి బీఎల్‌ఓలను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఓటరు ప్రత్యేక నమోదు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన నూతన ఓటరు లిస్టులను కూడా సిద్ధంగా ఉంచామని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు దొర్లిన ఓటర్లు బీఎల్‌ఓల దృష్టికి తీసుకురావాలని ఆమె ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఐ కురుమూర్తి, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, సువర్ణ, ఎల్లమ్మ, మహేశ్వరీ, చంద్రకళ, కమల, పారిజాత తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉర్సు


21న గంధోత్సవం, 22న ఉర్సు, 23న ఫాతేహాలు కార్యక్రమాలు కొనసాగుతాయి

అమరచింత: ఆహ్లాదకరమైన గుట్టలపై వెలసిన సయ్యద్ షా హాజీమాలంగ్ బాబా ఉర్సు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయని నిర్వాహకులు ముర్షద్ మైనొద్దీన్ తెలిపారు. ఈమేరకు దర్గా పరిసరాలను సుందరీకరించారు. మహిమలు కలిగిన హాజీమాలంగ్ బాబా దర్గా షరీఫ్‌ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు రాష్ట్రంలోని ప్రజలే కాకుండ మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు తరలి వచ్చి కందూర్లు చేయడం ఆనవాయితీగా మారింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన తెలుగు కురుమయ్య (40) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈనెల 15న బైక్‌పై వెళ్తున్న అతడిని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.